సాక్షి ప్రకాశం

సోమవారం। 30। జూన్। 2025



కూటమి పాపం.. నిరుద్యోగులకు శాపం

కూటమి ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకపోగా నిరుద్యోగ భృతికీ ఎగనామం పెట్టింది. - 8లో..



గురుకుల ఘోష

దర్శి గురుకుల పాఠశాలలో మెనూ సక్రమంగా అమలు చేయకపోవడంతో 600 మంది విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38 /29

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచాలి


- యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కే శ్రీనివాసరావు

ఒంగోలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచాలని యూటీఎఫ్ శ్రేణులకు యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. యూటీఎఫ్ కార్యవర్గ సమావేశం ఆదివారం ఒంగోలులో జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హై అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ సమాజంలో నాణ్యమైన, సమానమైన విద్య అందాలంటే ప్రభుత్వ విద్యావిధానం బలపడాలన్నారు. బేసిక్ ప్రైమరీ పాఠశాలల్లో 40 మంది విద్యార్థులు దాటితే 3వ పోస్టు ఇవ్వాలని, 2 సంవత్సరాలు ఒక ఉపాధ్యాయుడు ఒకేచోట పనిచేసేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హై మాట్లాడుతూ యూటీఎఫ్ కార్యకర్తలు అదనంగా పనిచేసి పాఠశాలలను సమాజానికి దగ్గరకు చేర్చాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు మాట్లాడుతూ ఉపాధ్యాయులందరినీ బోధనేతర పనులు తగ్గించి ఎన్‌రోల్‌మెంట్ పెంచే వాతావరణాన్ని కల్పించాలన్నారు. జిల్లాలో రిలీవర్ లేక చాలా మంది ఉపాధ్యాయులు బదిలీ అయినా పాత స్థానాల్లోనే పనిచేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకొని బదిలీ, ప్రమోషన్ తీసుకున్న ఉపాధ్యాయులందరినీ కొత్త స్థానాల్లో పనిచేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు రవి, సహాధ్యక్షురాలు ఉమామహేశ్వరి, కోశాధికారి చిన్నస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజసులోచన, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కష్టాలు!



కూటమి ప్రభుత్వంలో విద్యుత్ శాఖ తీరుతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఏ కారణంతోనైనా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే ఇక అంతే. అధికారుల చుట్టూ తిరగాల్సిందే. వాటి మార్పు ఖర్చులు సైతం వినియోగదారులు భరించాల్సిందే. వ్యవసాయ రంగానికి సంబంధించి విద్యుత్ సరఫరా అంతా అస్తవ్యస్తంగా ఉంది. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ అందని ద్రాక్షలా మారింది. పగటి పూటనే 9 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాల్సి ఉండగా.. కనీసం 6 గంటలు కూడా ఇవ్వని పరిస్థితి నెలకొంది. దీంతో అది పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గృహ వినియోగదారులు సైతం అనధికారిక విద్యుత్ కోతలు, అధిక బిల్లులతో అవస్థలు పడుతున్నారు.

- ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే గగనమే
- మార్పిడి భారం వినియోగదారులపైనే
- గ్రామీణ ప్రాంతాల్లో ఐదారు రోజులకు పైగానే పడుతున్న వైనం
- పట్టణ ప్రాంతాల్లో కూడా మూడు రోజులు దాటాల్సిందే
- అడ్డగోలుగా అనధికారిక కోతలు
- వ్యవసాయానికి తొమ్మిది గంటలు సరఫరా కాక అవస్థలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: వాతావరణ పరిస్థితుల వల్ల కానీ, ఓల్టేజి హెచ్చుతగ్గుల వల్ల కానీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందా... ఇక వినియోగదారులకు అవస్థలు ప్రారంభమైనట్లే. చిన్న ఈదురుగాలులు కొడితేనే కాలిపోవడం సర్వసాధారణమైంది. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినప్పుడు అర్బన్ ప్రాంతాల్లో అయితే 12 గంటలు, గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటల్లోగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చాలి. అప్పుడే రైతులు వంటలు దెబ్బతినకుండా కాపాడుకునే అవకాశం ఉంటుంది. ట్రాన్స్‌ఫార్మర్ రవాణా ఖర్చు కూడా విద్యుత్ శాఖ భరించాల్సి ఉంది. అయితే నిర్దీత సమయం ప్రకారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న దాఖలాల్లేవు. పైగా రవాణా ఖర్చులను కూడా రైతులపైనే వేస్తున్నారు. డిపార్టుమెంట్ వాహనంలోనే తరలిస్తూ వేలాది రూపాయలను రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే కొత్తది మార్చేందుకు ఐదారు రోజులు పడుతోంది. పట్టణాల్లో అయితే మూడు రోజులకు తక్కువ పట్టడం లేదు.



కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు

వ్యవసాయ విద్యుత్ అస్తవ్యస్తం...

వ్యవసాయ విద్యుత్ అస్తవ్యస్తంగా ఉంది. త్రీఫేజ్ విద్యుత్ ఇచ్చినట్లే ఇచ్చి తరచూ నిలిపేస్తున్నారు. ఇలా నిలిపేస్తుండటంతో 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండటం లేదు. తొమ్మిది గంటలు ఇస్తున్నామని చెబుతున్నా రెండు, మూడుసార్లు నిలిపేస్తుండటంతో రైతులు అవస్థ పడుతున్నారు. గృహాలకు ఇచ్చే విద్యుత్‌కు కూడా ప్రతిరోజూ గంటల తరబడి అనధికార కోతలు విధిస్తున్నారు. గాలులు వీచినా, వర్షాలు కురుస్తాయనుకున్న సమయంలో విద్యుత్ కోతలు మరింత అధికం. కరెంటు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. ఆఫీసులకు ఫోన్ చేసి విసిగిపోవాల్సిందే. ఒక వైపు అడపాదడపా వాన జల్లులు కురుస్తున్నా.. వాతావరణం మాత్రం అగ్నిగుండాన్ని తలపిస్తోంది. ఈ సమయంలో అనధికార విద్యుత్ కోతలు పగలూ రాత్రీ తేడా లేకుండా ఉండటంతో జనం ఇళ్లలో ఉండలేకపోతున్న పరిస్థితి. ఇదే సందర్భంలో విద్యుత్ బిల్లులు మాత్రం గతంతో పోల్చుకుంటే రెండింతలు, మూడింతలు పెరిగాయని వినియోగదారులు వాపోతున్నారు. సమయపాలన లేకుండా నిర్వహణ, ఇతర కారణాలు చెబుతూ కోత విధిస్తున్నారు. కొన్నిచోట్ల రోజులో నాలుగైదు గంటల చొప్పున సరఫరా ఉండటం లేదని విద్యుత్ వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు.

విద్యుత్ వినియోగం ఇలా...

జిల్లాలో రోజువారీ విద్యుత్ వినియోగ లక్ష్యం 8.150 మిలియన్ యూనిట్లు.. అయితే ఇచ్చిన లక్ష్యం కంటే తక్కువగానే కాలుతోంది. జూన్ నెల 22వ తేదీ 7.700 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. జూన్ నెల 23వ తేదీ 7.791 మిలియన్ యూనిట్లు మాత్రమే వినియోగించారు. కోటా కంటే ఎక్కువ విద్యుత్ వినియోగం ఉన్నప్పుడు కోతలు విధిస్తున్నారంటే అర్థం ఉంది. అలాంటిది కోటా కంటే తక్కువగానే విద్యుత్ వినియోగం ఉన్నా గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు కనీసం ఐదారు గంటల పాటు అనధికార కోతలు విధిస్తున్నారు. జిల్లా కేంద్రం ఒంగోలు నగరంలోనే ప్రతి రోజూ రెండు, మూడు గంటల పాటు విద్యుత్ కోతలు విధిస్తున్నారంటే విద్యుత్ శాఖ గాడి తప్పిందనే చెప్పాలి. అధికారుల చేతిలో ఏమీ లేదు. పైనుంచి ఏవిధమైన ఆదేశాలు వస్తే ఆ విధంగా చేయాల్సిందే తప్ప సొంత నిర్ణయాలు తీసుకునే స్థాయిలో జిల్లా విద్యుత్ శాఖ అధికారులు లేరు.

సమస్యలుంటే మా దృష్టికి తెండి



ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే ఒకటి, రెండు రోజుల్లో మారుస్తున్నాం. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఎక్కువగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. రెండు, మూడు నెలల గ్యాప్ తరువాత రైతులు వ్యవసాయ మోటార్లు స్టార్ట్ చేస్తున్నారు. కొంత గ్యాప్ తరువాత మోటార్లు వేసినప్పుడు సహజంగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతాయి. అందుకే దాదాపు 500 ట్రాన్స్‌ఫార్మర్లు రిపేర్లు చేసి సిద్ధంగా ఉంచాం. రైతులకు కానీ, పట్టణాల్లో కానీ వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వటానికి ఎలాంటి సమస్యలు లేవు. అలాంటి సమస్యలు ఉన్నా, విద్యుత్ సిబ్బంది ఇబ్బందులు పెట్టినా నేరుగా నా దృష్టికి తీసుకురావచ్చు.

– కట్టా వెంకటేశ్వర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్, ఏపీసీపీడీసీఎల్

జిల్లాలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు

ఏప్రిల్	328
మే	337
జూన్ (23వ తేదీ వరకు)	286



పశ్చిమ ప్రాంతంలో పొలంలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)

స్మార్ట్ షాక్...

వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న సమయంలో స్మార్ట్ మీటర్లను చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ తీవ్రంగా వ్యతిరేకించారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులకొట్టాలని పిలుపునిచ్చారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అవే స్మార్ట్ మీటర్లు బిగించటం ముమ్మరం చేశారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు, పారిశ్రామిక, వాణిజ్య, వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగించటం పూర్తి కావస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలకు జిల్లాలో 16,109 స్మార్ట్ మీటర్లు బిగించాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు 13,961 మీటర్లు బిగించారు. కమర్షియల్ స్మార్ట్ మీటర్లు జిల్లా వ్యాప్తంగా 84,751 బిగించాలని లక్ష్యం కాగా ఇప్పటి వరకు 70,208 బిగించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒంగోలు నగర పాలక సంస్థతో పాటు ''అమృత్'' మంచినీటి పథకాలు ఎక్కడైతే మంజూరు చేశారో ఆయా నగరాలు, పట్టణాల్లో కూడా స్మార్ట్ మీటర్లు బిగించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా ఆదేశాలు జారీ చేసింది. దాంతో ఒంగోలు నగరంలో కూడా స్మార్ట్ మీటర్లు బిగించే కార్యక్రమాన్ని ఇప్పటికే మొదలుపెట్టారు.



గుండ్లాపల్లి ఇండస్ట్రియల్ కారిడార్‌లో కమర్షియల్ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న సిబ్బంది

అడ్డగోలు కోతలపై జనాగ్రహం

- విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కొవ్వొత్తులతో గ్రామస్తుల నిరసన

సింగరాయకొండ: మండల కేంద్రంలో పగలు, రాత్రి తేడా లేకుండా విద్యుత్ కోతలు విధించడంతో ఆగ్రహించిన బాలయోగినగర్, అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు ఆదివారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. కొద్ది రోజులుగా విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని, కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో అర్థం కావటం లేదన్నారు. చిన్న గాలివాన వచ్చినా విద్యుత్ నిలిపేస్తున్నారని ఆరోపించారు. అసలే వాతావరణ ప్రభావంతో ఎండతీవ్రత బాగా ఉందని, రాత్రి అయినా వేడి తగ్గటం లేదని, మరో పక్క విద్యుత్ సక్రమంగా ఉండకపోవటంతో ఎలా బతకాలని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. ఆదివారం ఉదయం నుంచి తరచూ విద్యుత్‌కు అంతరాయం కలుగుతోందని, ఇప్పుడు రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు అధికారులను నిలదీద్దామని వచ్చామని, ఇక్కడ సిబ్బంది ఎవరూ లేరని విద్యుత్ శాఖ ఏఈ సాంబశివరావుకు ఫోన్ చేస్తే జాతీయ రహదారిపై లారీ యూనియన్ ఆఫీసు సమీపంలో విద్యుత్ తీగలు తెగాయని మరమ్మతు చేస్తున్నామని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి సమస్య ఉంటే ఇప్పుడు తీరిగ్గా రాత్రి పూట మరమ్మతులు చేయటం ఏమిటని, దీనిని బట్టి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం అర్థమవుతోందని ఆరోపించారు. విద్యుత్ అధికారుల వైఖరికి నిరసనగా సబ్‌స్టేషన్ వద్ద కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు.



సింగరాయకొండ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

సర్పంచ్ కుటుంబ సభ్యులకు బూచేపల్లి, తాటిపర్తి పరామర్శ

పెద్దదోర్నాల: అక్రమ కేసులతో అరెస్టయిన చిన్న గుడిపాడు సర్పంచ్ వల్లభనేని మల్లికార్జున (పవన్) కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ పరామర్శించారు. ఆదివారం మండలంలో పర్యటించిన వారు చిన్నగుడిపాడులోని పవన్ స్వగృహంలో అతని బంధువులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. టీడీపీ ప్రభుత్వ అధికారం ఉందన్న గర్వంతో తప్పుడు కేసులు బనాయిస్తోందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బాధితుల పక్షాన నిరంతరం పోరాడుతోందని తెలిపారు. ప్రజాదరణ కలిగిన వల్లభనేని మల్లికార్జునను ఆర్థికంగా, రాజకీయంగా ఇబ్బందులకు గురి చేయాలనే ఇటువంటి కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు. దీంతో పాటు ఇటీవల శస్త్రర చికిత్సలు చేయించుకున్న గాదె బ్రహ్మారెడ్డిని తన నివాస గృహంలో పరామర్శించి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట పార్టీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డితో పాటు మండల నాయకులు, స్థానిక నాయకులు ఉన్నారు.



సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు


తిరస్కరణలతో సరి.. రైతు కంట కన్నీటి ఝరి..

- కనిగిరి బోర్డు పరిధిలో 8.5 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తి
- పది రౌండ్లు పూర్తవుతున్నా 3.18 మిలియన్ కేజీలు మాత్రమే కొనుగోలు
- దిగజారిన కనిష్ట ధరలు
- ఇళ్లలో నుంచి కదలని బేళ్లు
- స్పందించని అధికారులు, బయ్యర్లు
- నేడు వేలం కేంద్రం వద్ద ధర్నాకు సిద్ధమవుతున్న రైతులు

కనిగిరిరూరల్: కూటమి పాలనలో పొగాకు రైతులు కుదేలయ్యారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో కంపెనీల ప్రతినిధులు, అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కనిగిరి టుబాకో బోర్డు పరిధిలో పొగాకు సాగు విస్తీర్ణం 4,952 హెక్టార్లు ఉండగా.. 5 క్లస్టర్ల పరిధిలో 74 గ్రామాల్లో 1,245 బ్యార్నీలు ఉన్నాయి. ఈ ఏడాది పొగాకు ఉత్పత్తి 8.5 మిలియన్ కేజీలు వచ్చింది. కనిగిరి టుబాకో బోర్డులో మార్చి 19 నుంచి పొగాకు వేలం కేంద్రం ప్రారంభమైంది. ఇప్పటికి పది రౌండ్లు వేలం అయినా కేవలం 3.18 మిలియన్ కేజీల పొగాకు మాత్రమే కొనుగోలు చేశారు. ప్రతి బ్యార్నీ నుంచి 12 బేళ్ల వరకు అనుమతి ఉన్నా ఇప్పటి వరకు నాలుగు, ఐదుసార్లు వేలానికి వెళ్లిన పొగాకు రైతులకు చేదు అనుభవం ఎదురవుతోంది. కేవలం గ్రేడ్1 (ఎఫ్1,ఎఫ్2,ఎఫ్3) రకాల పొగాకును మాత్రమే కొనుగోలు చేసి.. మిగతా రకం బేళ్లను తిరస్కరిస్తున్నారు. దీంతో ప్రతిసారి వేలం కేంద్రానికి వెళ్లడం ఒకటి రెండు బేళ్లు మాత్రమే కొనుగోలు జరగడంతో.. మిగతా వాటిని తీసుకుని ఉసూరుమంటూ తిరిగి ఇంటికి వెళ్లే దుస్థితి ఏర్పడింది. గత ఏడాది కనిగిరి టుబాకో బోర్డు పరిధిలో 7.58 మిలియన్ కేజీల ఉత్పత్తి వచ్చింది. దాదాపు రైతు దగ్గర ఉన్న పొగాకు మొత్తాన్ని బోర్డు అధికారులు, ప్రభుత్వం కొనుగోలు చేసింది. గత ప్రభుత్వంలో గరిష్ట ధర కేజీ రూ.350 నుంచి రూ.360 వరకు, కనిష్ట ధర రూ.280 నుంచి రూ.270 వరకు కొనుగోలు చేశారు.



రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని కంపెనీ ప్రతినిధులను, అధికారులను నిలదీస్తున్న వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ, పార్టీ నేతలు (ఫైల్)



అన్ని గ్రేడ్‌లను కొనాలని బయ్యర్లను ప్రశ్నిస్తున్న రైతులు(ఫైల్)

కనిష్ట ధర దిగజారినా..

కనిగిరి బోర్డులో ఈఏడాది ప్రారంభ వేలంలో కేజీ పొగాకు కనిష్ట ధర రూ.180 వరకు పలికినా.. వారం రోజులుగా కనిష్ట ధర కేజీ రూ.150కి పడిపోయింది. ఈ ఏడాది ఇప్పటి వరకు గరిష్ట ధర రూ.280 మాత్రమే ఉంది. అంతేగాక మీడియం, లోగ్రేడ్ పొగాకు బేళ్లను కొనుగోలు చేయకపోతుండటంతో ఇళ్లల్లో పేరుకుపోయిన పొగాకు బేళ్లను చూసుకుంటూ తెచ్చిన పెట్టుబడి అప్పులు ఎలా తీర్చాలనే బెంగతో పొగాకు రైతు లోలోన కుములుతున్నాడు.

బయ్యర్లతో అధికారుల కుమ్మక్కు?

కనిగిరి టుబాకో బోర్డు అధికారులు, బయ్యర్ల తీరును నిరసిస్తూ ఇప్పటికి అనేక దఫాలు రైతులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. బయ్యర్లతో ఆక్షన్ సూపరింటెండెంట్ కుమ్మక్కయి రైతులను అన్యాయం చేస్తున్నాడని, వారికి నచ్చిన రైతులకు న్యాయం చేసి.. మిగతా వారికి ఇబ్బంది పెడుతున్నారని ఆరోపణలు చేశారు. రెండు రోజుల క్రితం పామూరు మండలం వెంకట్రావుపాలెంకు చెందిన పెద్ద రైతు .. తమకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులకు అన్యాయం చేయవద్దని అడిగినందుకు తాగి వచ్చావా..? అంటూ ఆక్షన్ సూపరింటెండెంట్ దురుసు వ్యాఖ్యలు చేశారు. దీనిపై రైతులు నిరసన తెలిపారు. ఆర్ఎంకు కూడా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం, కంపెనీలు, అధికారులు అందరూ కలిసి పొగాకు రైతును పూర్తిగా అన్యాయం చేస్తున్నారని రైతు సంఘ నాయకులు తీవ్రంగా ధ్వజమెత్తుతున్నారు. భారీ ఎత్తున బేళ్లు తిరస్కరిస్తుండటం, కనిష్ట ధరలు నానాటికీ దిగజారడాన్ని నిరశిస్తూ సోమవారం కూడా మరోమారు ధర్నా చేపట్టనున్నట్లు రైతు సంఘ నాయకులు తెలిపారు.

వారం రోజులుగా కనిగిరి వేలం కేంద్రంలో పొగాకు బేళ్ల తిరస్కరణ ఇలా..

తేదీ	వచ్చిన పొగాకు బేళ్లు	తిరస్కరించినవి
23	798	401
24	738	455
25	705	340
26	696	357
27	552	224
28వ తేదీ రైతులు వేలం బహిష్కరించారు		

పొగాకు రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం



పొగాకు రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ఈ ఏడాది రైతులకు మద్దతు ధర లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం పొగాకు రైతులను విస్మరించడంతో బయ్యర్లు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. పొగాకు రైతుకు గిట్టుబాటు ధర లేక.. బేళ్లన్నీ అమ్ముడుపోక ఇబ్బంది పడుతున్నారు. నామ్‌కే వాస్తే ఒకటి రెండు బేళ్లను మీడియంను కొనుగోలు చేసి.. సరాసరి ధర రూ.240 అంటూ బోర్డు అధికారులు ప్రకటిస్తున్నారు. దీని వల్ల పొగాకు రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది.

– సూరసాని మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి

పొగాకు రైతును ప్రభుత్వం ఆదుకోవాలి



పొగాకు రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. రైతు పండించిన పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి. రైతు తెచ్చిన పొగాకు బేళ్లన్నీ కొనుగోలు చేయాలి. లోగ్రేడ్ పొగాకును నోబిడ్ పేరుతో తిరస్కరించడం సరైంది కాదు. అధికారులు బయ్యర్లతో కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నారు. పొగాకు రైతుకు కనీస మద్దతు ధర కల్పించాలి.

– గుజ్జుల బాలిరెడ్డి, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ''బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'' గురించి చర్చించేందుకు విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు హాజరవుతారన్నారు. పార్టీ పార్లమెంట్ పరిశీలకులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, నియోజకవర్గ అనుబంధ విభాగ అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా పార్టీ కమిటీ సభ్యులు, జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా ముఖ్య నాయకులు పాల్గొనాలని కోరారు.

గ్రూప్-1 ఫలితాల్లో సత్తాచాటిన యడవల్లి విద్యార్థిని



కటకం సాత్విక (ఫైల్)

రాచర్ల: మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన కటకం సాత్విక అనే విద్యార్థిని గ్రూప్-1 పరీక్ష ఫలితాల్లో సత్తాచాటింది. తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయి 440 ర్యాంకు సాధించింది. గ్రూప్-1 పరీక్షల్లో రాసి ఉత్తీర్ణత సాధించిన కటకం సాత్విక తల్లిదండ్రులైన విద్యాసాగర్, నాగేంద్రమ్మతో పాటు గ్రామ ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

ఆరుగురు జూదరుల అరెస్టు

మద్దిపాడు: మండలంలోని ఏడుగుండ్లపాడు, ఇనమనమెళ్లూరు గ్రామాల మధ్య కోడిపందేలు నిర్వహిస్తున్న వారిని ఆదివారం మద్దిపాడు పోలీసులు, యాంటీ గూండా స్క్వాడ్ సిబ్బంది పట్టుకున్నారు. పక్కాగా అందిన సమాచారంతో కోడిపందేల శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.11,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. శిబిరం వద్ద ఉన్న 11 మోటార్ సైకిళ్లు, 11 సెల్‌ఫోన్లు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకుని మద్దిపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసిన వారిని సోమవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ శివరామయ్య తెలిపారు.

కోడి పందేల శిబిరంపై దాడి

- 22 మంది జూదరుల అరెస్టు
- 8 కోళ్లు, రూ.30,830 నగదు స్వాధీనం

పామూరు: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో కోడిపందేలు ఆడుతున్న, పేకాట ఆడుతున్న మొత్తం 22 మందిని ఆదివారం సాయంత్రం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.30,380 నగదు, 8 కోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు. మండలంలోని బుక్కాపురం సమీపంలోని పొలాల్లో కోడిపందాలు ఆడుతున్న 14 మందిని అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి 8 కోళ్లు, రూ.20,150 నగదు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా రావిగుంటపల్లె సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి రూ.10,680 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వారిపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిషోర్‌బాబు తెలిపారు.



కోడిపందేలు ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కూటమి పాపం.. నిరుద్యోగులకు శాపం

- అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ నిరుద్యోగులతో చంద్రబాబు చెలగాటం
- ఈసారీ అదే తీరు
- ఏడాది పాలనలో కొత్తగా ఒక్క ఉద్యోగం కూడా కల్పించని ప్రభుత్వం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన ఉద్యోగాలు కూడా తొలగింపు
- నిరుద్యోగ భృతి పేరుతో నిలువునా మోసం
- జిల్లాలో 5 లక్షల మందికిపైగా బాధితులు



ఒంగోలు వన్‌టౌన్: నిరుద్యోగులను సీఎం చంద్రబాబు నిలువునా మోసం చేశారు. ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు, మోసపూరిత మాటలతో మభ్యపెట్టారు. తమకు ఓట్లేసి గెలిపిస్తే భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, అప్పటి వరకూ నిరుద్యోగ భృతిగా నెలకు రూ.3 వేలు అందిస్తామని హామీ ఇచ్చారు. నమ్మి ఓట్లేసిన వారిని అధికారంలోకి వచ్చాక పూర్తిగా విస్మరించారు. కొత్త ఉద్యోగాలు కల్పించకపోగా, నిరుద్యోగ భృతి చెల్లించకపోగా, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉద్యోగాలు పొందిన వారందరినీ తొలగించారు. రాజకీయ వేధింపులు, కక్ష సాధింపులతో వేల మందిని నిరుద్యోగులుగా మార్చారు. వారి కుటుంబాలను రోడ్డున పడేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన మొత్తం ఇలాంటి కుట్రలు, కుతంత్రాలతోనే సాగడం నిరుద్యోగుల పాలిట శాపంగా మారింది.

సూపర్ 6.. నిరుద్యోగ భృతికి మంగళం...

ఎన్నికల సమయంలో సూపర్ 6 పథకాల గురించి కూటమి పార్టీల నేతలు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. వాటిలో ఒకటైన నిరుద్యోగ భృతి పథకం కింద ఉద్యోగాలు కల్పించేంత వరకూ నిరుద్యోగులుగా ఉన్న వారికి నెలకు రూ.3 వేలు చెల్లిస్తామని చెప్పారు. అధికారం చేపట్టగానే అన్ని పథకాలు అమలు చేస్తామన్నారు. ఏడాది దాటినా నిరుద్యోగ భృతి గురించి సీఎం చంద్రబాబుతో పాటు కూటమి పార్టీల నాయకులెవరూ మాట్లాడటం లేదు. ఏడాది నుంచి ఎదురుచూసిన నిరుద్యోగులు ఇక నిరుద్యోగ భృతి లేనట్టేనంటూ పాలకుల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు తమను మరోసారి మోసం చేశారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సుమారు 5 లక్షల మంది నిరుద్యోగులున్నారు. వీరంతా నిరుద్యోగ భృతి కోసం ఏడాది నుంచి ఎదురుచూశారు. ప్రభుత్వం మాత్రం ఆ ఊసే ఎత్తకపోవడంతో అసంతృప్తితో రగిలిపోతున్నారు.

వేల సంఖ్యలో ఉద్యోగుల తొలగింపు...

కొత్త ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి లేకపోగా, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కల్పించిన ఉద్యోగాలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఊడబీకింది. వలంటీర్లకు గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచుతామని చెప్పి వారందరినీ పూర్తిగా తొలగించి ఉపాధి లేకుండా చేసింది. నూతన మద్యం పాలసీతో ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న ఉద్యోగులను రోడ్డున పడేసింది. రేషన్ షాపుల్లోనే బియ్యం, సరుకులు విధానం ద్వారా ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, హెల్పర్ల పొట్టకొట్టింది. చివరకు పారిశుధ్య కార్మికులు, ఫ్యామిలీ ఫిజీషియన్లు, రేషన్ డీలర్లపై సైతం కక్ష సాధింపులు, వేధింపులకు పాల్పడుతూ ఉన్న ఉద్యోగాలు తొలగించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నియమించిన వారిని తొలగించాలనే కుట్రలతో పాటు కూటమి పార్టీల శ్రేణులకు దోచిపెట్టాలనే దురుద్దేశంతో అన్ని వ్యవస్థలనూ అతలాకుతలం చేస్తోంది. రాజకీయ కారణాలతో అవకాశం ఉన్న ప్రతి శాఖలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలను తీసివేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది.

2014-19లోనూ జాబు రావాలంటే బాబు రావాలంటూ మోసం...

సీఎం చంద్రబాబునాయుడు 2014-19లోనూ నిరుద్యోగులు, ఉద్యోగుల పట్ల ఇదేవిధంగా వ్యవహరించారు. ఆనాడు కూడా ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు పెద్ద ఎత్తున హామీలిచ్చారు. 600కుపైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత నిరుద్యోగులను, ప్రజలను దారుణంగా మోసం చేశారు. జాబు రావాలంటే బాబు రావాలి, ఇంటికో ఉద్యోగం, ఉద్యోగం వచ్చేంత వరకూ రూ.2 వేల నిరుద్యోగ భృతి అని అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు. ఐదేళ్ల పాలనలో ఏ ఒక్కటీ అమలు చేయకుండా కల్లబొల్లి మాటలతో కాలం వెల్లదీశారు. మోసపోయామని గ్రహించిన నిరుద్యోగులు 2019 ఎన్నికల్లో గట్టిగా గుణపాఠం చెప్పారు. అయినప్పటికీ 2024లో ఎలాగైనా అధికారంలోకి రావాలనే ఉద్దేశంతో నిరుద్యోగులతో చంద్రబాబు మరోసారి చలగాటమాడారు. నిరుద్యోగ భృతి హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తకుండా మోసం చేస్తున్నారు.



జిల్లా ఉపాధి కార్యాలయం

కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో తొలగించిన ఉద్యోగులు

వలంటీర్లు	14,000 మంది
మద్యం దుకాణాల ఉద్యోగులు	684 మంది
ఎండీయూ వాహనాల సిబ్బంది	1,155 మంది
రేషన్ డీలర్లు	500 మంది
శానిటేషన్ సిబ్బంది	200 మంది

నిరుద్యోగులంతా ఆందోళనలో ఉన్నారు



సీఎం చంద్రబాబు గతంలో కూడా నిరుద్యోగులను మోసం చేశారు. 2014–19 పాలనలో నిరుద్యోగ భృతిగా రూ.2 వేలు చెల్లిస్తామని చెప్పారు. నాలుగున్నరేళ్లు పట్టించుకోలేదు. 2019 ఎన్నికలకు ముందు ఓట్ల కోసం అతి కొద్దిమందికి మాత్రమే చెల్లించారు. ప్రస్తుతం రూ.3 వేలు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి మళ్లీ పట్టించుకోవడం లేదు. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఏడాది పాలనలో జిల్లాలో ఒక్క కొత్త ఉద్యోగం కూడా కల్పించలేదు. నిరుద్యోగ భృతి కూడా లేదు. ఇప్పట్లో ఇచ్చే పరిస్థితి కూడా కనిపించడం లేదు. జిల్లావ్యాప్తంగా నిరుద్యోగులు ఆందోళనలో ఉన్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం అమలు చేయలేని అబద్ధపు హామీలు, మోసపూరిత మాటలతో చంద్రబాబు మోసం చేస్తూనే ఉన్నారు.

– ఎండీ ఇమ్రాన్‌ఖాన్, కార్పొరేటర్, ఒంగోలు

ఆవుల మందపై పెద్ద పులి దాడి

- రెండు ఆవులు మృతి
- భయాందోళనలో గిరిజనులు



మరణించిన ఆవు వద్ద విలపిస్తున్న నానికే నాయక్

యర్రగొండపాలెం: మండలంలోని పాలుట్లలో పెద్ద పులి మరో సారి పశువులపై దాడి చేసింది. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత పెద్దపులి గిరిజన గూడెంలోకి జొరబడింది. పశువుల కొష్టంలోకి వెళ్లిన పెద్ద పులి అక్కడ ఉన్న రెండు ఆవులను తీవ్రంగా గాయపరచడంతో ఆ రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. జీవనాధారమైన ఆవులు మృతి చెందడంతో ఆ ఆవుల యజమాని కొడావత్ నానికే నాయక్ బోరున విలపించాడు. ఈ నెల 12న పెద్ద పులి పాలుట్లలోని పశువుల కొష్టంలోకి వెళ్లి దాదాపు రూ.70వేల విలువ చేసే రెండు ఎద్దులను హతమార్చింది. ఒకే నెలలో రెండు పర్యాయాలు పెద్దపులి పాలుట్లలో సంచరించి 4 పశువులను పొట్టన పెట్టుకోవడంతో ఆ గిరిజన గూడెం వాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఫారెస్ట్ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకొని పెద్దపులి బారి నుంచి కాపాడాలని గిరిజనులు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: ప్రజల సమస్యల పరిష్కారం కోసం కాల్ సెంటర్–1100ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కాల్ సెంటర్–1100 ద్వారా ప్రజలు సమస్యలను ఆన్‌లైన్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీదారులు ఆ నంబర్‌కు డయల్ చేసి, తమ సమస్యను విన్నవిస్తే ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదు రిజిస్టర్ చేసుకుంటుందని వివరించారు. ఆ సమస్యను సంబంధిత అధికారికి పంపి తద్వారా పరిష్కరించేందుకు వీలు కలుగుతుందన్నారు. జిల్లాలోని ప్రజలంతా కాల్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గురుకుల ఘోష

- దర్శి గురుకుల పాఠశాలలో విద్యార్థుల ఇక్కట్లు
- మెనూ అమలు చేయకుండా పిల్లలను పస్తులు పెడుతున్న వైనం
- 600 మంది పిల్లలకు 12 లీటర్ల పాలు
- ఆకలి తట్టుకోలేక గోడ దూకి బయటకు వెళుతున్న విద్యార్థులు
- ప్రిన్సిపాల్ వైఖరిపై సర్వత్రా విమర్శలు

దర్శి(కురిచేడు): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుకుల పాఠశాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఫలితంగా విద్యార్థులు భోజనం సక్రమంగా అందక గోడలు దూకి బయటకు వెళ్లి తినాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇది దర్శి అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పరిస్థితి. ఈ పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో పర్యవేక్షణ లేకపోవడంతో మెనూ సక్రమంగా అమలు చేయడం లేదు. .

అమలు కాని మెనూ..

గురుకుల పాఠశాలలో మెనూ ఎప్పుడో మరిచిపోయారు. ఇష్టం వచ్చినట్లు విద్యార్థులకు భోజనం అందిస్తున్నారు. దీంతో విద్యార్థులు పాఠశాల గోడలు దూకి బయటకు వెళ్లి తిని వచ్చే పరిస్థితులు ఇక్కడ ఉన్నాయి. మొత్తం 600 మంది విద్యార్థులకు కేవలం 12 లీటర్ల పాలనే వినియోగిస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వారంలో రెండు రోజులు చికెన్ ఇవ్వాల్సి ఉండగా..నెలలో ఒకటి రెండు రోజు మాత్రమే తూతూమంత్రంగా పెడుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు. 70 కిలోల వరకు చికెన్ తీసుకురావాల్సి ఉండగా 35 కిలోలు తీసుకువచ్చి సరిపెడుతున్నారు. రోజూ ఇవ్వాల్సిన గుడ్లను వారంలో రెండు మూడు రోజులు మాత్రమే ఇస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం వండిన వంటలను రాత్రికి పెడుతున్నారని పలువురు విద్యార్థులు వాపోయారు.

పట్టించుకునేదెవరు..?

గురుకుల పాఠశాల పర్యవేక్షణ కోసం పాఠశాల ఆవరణలోనే ప్రిన్సిపాల్ కోసం ఒక భవనాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రిన్సిపాల్ అందులోనే నివాసం ఉండి విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడాల్సి ఉంది. కానీ ఇక్కడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఉన్న వ్యక్తి సింగరాయకొండలో నివాసముంటూ ఉదయం 10 గంటలకు వచ్చి సాయంత్రం 4 గంటలకు వెళ్లిపోతుండటంతో పాఠశాలలో ఏం జరుగుతుందో పర్యవేక్షించే వారే కరువయ్యారు. దీంతో విద్యార్థులు పాఠశాలను వీడి బయటకు వెళ్లిపోతున్నారు. పాఠశాల గేటు పక్కన ఖాళీ మద్యం సీసాలు, తినుబండారాల ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. ఆటస్థలంలో విషసర్పాలు సంచరిస్తున్నా, పాఠశాల ఆవరణలోని కంపచెట్లను తొలగించి శుభ్రం చేయించకపోవడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. పాఠశాల ప్రహరీ కూలినా మరమ్మతులు చేయకపోవడంతో రాత్రిళ్లు పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం.

ఉన్నతాధికారుల కనీస పర్యవేక్షణ కొరవడడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు గురుకుల పాఠశాలపై దృష్టి సారించి విద్యార్థుల ఇక్కట్లు తీర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



హాస్టల్ గేటు పక్కన ఉన్న ఖాళీ మద్యంసీసాలు, గ్లాసులు, కవర్లు



గురుకుల పాఠశాల



కూలిపోయిన ప్రహరీ



ప్రహరీ దూకుతున్న విద్యార్థులు

జగనన్న పాలనలో మహిళలకే అగ్రపీఠం

- మంత్రి వర్గంలో, పార్టీ పదవుల్లో ప్రాధాన్యం
- కూటమి ప్రభుత్వంలో కీచక పర్వం
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



ఉడుముల దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు అగ్రపీఠం వేశారని, వారికి ప్రాధాన్యత ఇచ్చి ఎంతో గౌరవించారని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ఎంపికైన ఉడుముల అరుణ శ్రీనివాసరెడ్డిని ఆయన శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకలాపాల్లో మహిళల పాత్ర ముఖ్యమైందన్నారు. వారు ప్రతి విషయంలో చొరవచూపి ముందుకు కొనసాగుతుంటారని, అటువంటి మహిళలకు జగనన్న తన కేబినేట్‌లో ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. మంత్రివర్గంతో పాటు నామినేటెడ్ పదవులు, పార్టీ పదవులను సైతం ఎక్కువ భాగం మహిళలకే కేటాయించి వారిపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు పూర్తిగా మహిళల పేరుతోనే మంజూరు చేసి వారి గౌరవాన్ని ఇతోధికంగా పెంచారన్నారు. ప్రస్తుతం రాష్ట్రాన్ని పాలిస్తున్న కూటమి ప్రభుత్వంలో మహిళలకు ఎక్కడా గౌరవం లేకుండా పోయిందని, కీచక పర్వం పెచ్చరిల్లి పోతుందని విమర్శించారు. మహిళలపై లైంగిక దాడులు, హత్యలు, దాడులు ఎక్కువ అయ్యాయని, బాలికలను సైతం వదలకుండా అన్ని విధాలుగా వారిపై దాడులు జరుగుతున్నా సీఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలపై ప్రశ్నించేవారిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపుతున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు తనయుడు విద్యాశాఖ మంత్రి లోకేష్ రెడ్‌బుక్ అమలు అంటూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నాడన్నారు. ప్రస్తుత పాలనలో మహిళలు తమ గళాన్ని వినిపించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలపై మహిళలు ఉద్యమించి పరిష్కరించుకోవాలని, అందుకు పార్టీతో పాటు తన అండదండలు ఉంటాయన్నారు. మహిళా విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ఎంపికైన అరుణమ్మ పదవులతో సంబంధం లేకుండా ప్రజలకు సేవలు అందిస్తూ వచ్చారని కొనియాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అభివృద్ధి పరుచుకునేందుకు, ప్రజల సమస్యలను పరిష్కరించుకోవటానికి మహిళలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

మహిళలకు రాత్రివేళ డ్యూటీలు దుర్మార్గం

- జూలై 9న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: మహిళలు రాత్రి షిఫ్టుల్లో పని చేయాలని ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గమని, ఇది కార్మిక హక్కులపై దాడి చేయడమేనని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు అన్నారు. జూలై 9వ తేదీ దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో ఆదివారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో కార్మిక సంఘాల సంయుక్త సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ లేబర్ కోడ్లు అమల్లోకి వస్తే కార్మికులు తమకు న్యాయబద్ధంగా రావాల్సిన వాటిని సాధించేందుకు సమ్మెలు చేసే అవకాశాన్ని కోల్పోతారని చెప్పారు. యూనియన్లు పెట్టుకునే హక్కుతో పాటు సమ్మె హక్కులను కూడా కోల్పోతారన్నారు. ఒకరోజు సమ్మె చేస్తే 8 రోజుల వేతనాన్ని కట్ చేయడం లాంటి క్రూర నిబంధనలను తీసుకొస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం 8 గంటల పని దినానికి తూట్లు పొడుస్తూ 10 గంటల పనిదినాన్ని తీసుకొచ్చిందని మండిపడ్డారు. కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. ఓటీని 140 గంటలకు పెంచడం కార్మికుల మీద పాలకులు చేస్తున్న దాడిగా భావించాల్సి ఉంటుందన్నారు. ఒకవైపు కార్మికుల హక్కులను తుంగలో తొక్కుతూ.. మరోవైపు ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ దేశంలోని అన్ని కార్మిక సంఘాలు విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు గత నాలుగేళ్లుగా పోరాటాలు చేస్తున్నాయని తెలిపారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయకుండా అడ్డుకునేందుకు కార్మిక సంఘాలు ఉద్యమాలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గకపోవడం దుర్మార్గమన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయకుండా పనిభారాన్ని పెంచుతున్నారని విమర్శించారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఉద్యోగ భద్రత కల్పించకుండా స్కీం వర్కర్లచే పనులు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సైతం ఉల్లంఘిస్తున్నారని వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అప్పుల ఊబిలో కూరుకుపోయిన అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన చెందారు. ఉద్యోగులు, కార్మికులు, రైతులు, మహిళా సంఘాలు, విద్యార్థి, యువజనులు లేబర్ కోడ్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు ఎంఎస్ సాయి, వెంకటరావు, శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, పారా శ్రీనివాసులు, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

మోదీ పాలనలో తీవ్ర నిర్బంధం

- సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

ఒంగోలు టౌన్:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనలో దేశంలో తీవ్ర నిర్బంధం కొనసాగుతోందని సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ విమర్శించారు. ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లయిన సందర్భంగా ఎమర్జెన్సీ నాడు-నేడు అనే అంశంపై స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు అధ్యక్షత వహించగా, రాంభూపాల్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రశ్నించే వారిని, మోదీని విమర్శించే వారిని ఉపా చట్టం కింద అరెస్టు చేసి ఆరు నెలలకు పైగా బెయిల్ రాకుండా నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడితే దేశ ద్రోహం ముద్రలు వేసి దాడులు చేస్తున్నారని విమర్శించారు. న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రభీర్, స్టాన్ స్వామి ఉదంతాలను ఉదాహరించారు. రాజ్యాంగ హక్కులను కాలరాయడంతో పాటుగా రాజ్యాంగాన్నే మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో భిన్నమతాల సామరస్యానికి భిన్నంగా మత నియంతృత్వం కొనసాగాలని మోదీ కోరుకుంటున్నారని చెప్పారు. దేశ ప్రజలు స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సదస్సులో సీపీఎం నాయకులు కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, వై.సిద్దయ్య, ఏవీ పుల్లారావు పాల్గొన్నారు.